


వెల్లంకి గ్రామాన్ని సందర్శించిన యుపి ప్రజాప్రతినిధులు, అధికారులు



## కాళేశ్వరం అవినీతిపై సిబిఐ దర్యాప్తు అంటే బిఆర్ఎస్ నాయకులకు వణుకు

### తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని దీనిపై సిబిఐ ఎంక్వైరీ చేయిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే బిఆర్ఎస్ నాయకులకు వణుకేందు కని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళ వారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 రోజులుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిని ప్రజల ముందుకు ప్రభుత్వం తీసుకవచ్చేందుకు అసెంబ్లీలో చర్చిస్తే తమ బండారం బయటపడడంతో గత పాలకులు తట్టుకోలేకపోతున్నారని అన్నారు. గుమ్మడి కాయల దొంగలంటే తడుము కున్నట్లు ఒక్కొక్క నాయకుడు తమకు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, జగదీష్ రెడ్డిలు కాళేశ్వరం జలాలపై క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట ప్రాంతానికి వస్తున్న నీళ్ళు కాళేశ్వరం ద్వారా వస్తున్నాయా లేక ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి వస్తున్నాయా అనే విషయం ప్రజలకు చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వేల కోట్ల రూపాయలు అవినీతి జరగడంతో రాష్ట్రం అప్పులపాలైందని దీని వడ్డీ ఖర్చే రూ. 6 నుండి 7 వేల కోట్లు చెల్లించడం జరుగుతుందన్నారు. ఇది గుదిబండగా మారి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందని చెప్పారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలోనే పోచంపల్లి నుండి కాల్వల ద్వారా ఈ ప్రాంతానికి నీళ్ళు వచ్చిన విషయాన్ని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి గమనించాలన్నారు. కాళేశ్వరం లేకుండానే అప్పట్లో రైతులు పంటలు పండించుకున్నారని తెలిపారు. కాళేశ్వరం పేరిట అవినీతికి పాల్పడి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన దోషులను కఠినంగా శిక్షించాల్సిందేనని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యురాలు కవిత కూడా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సామాజిక మాధ్యమాలలో అసభ్య పదజాలం ఉపయోగించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను, కాంగ్రెస్ నాయకులను జగదీష్‌రెడ్డి అవమాన పరుస్తున్నారని తప్పు పట్టారు. యూరియా కొరతపై బిఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయద్దన్న విషయం వారికి తెలియదన్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియాను సరఫరా చేయాల్సి ఉండగా చైనా నుండి దిగుమతి చేసుకోవడంలో కొంత ఇబ్బంది జరిగినట్లు బిజెపి ప్రజాప్రతినిధులే స్వయంగా చెబుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలు తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్, సీనియర్ నాయకులు డాక్టర్ పూర రాంమ్మూర్తి యాదవ్, నాయకులు సూదిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తండు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## నాలుగు వేల అమరవీరుల రక్త తర్పణం...

### తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు జయప్రదం చేయండి : పల్లా నర్సింహారెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/దేవరకొండ:** భూమి కోసం, భూక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఈనెల 11 నుండి 17 వరకు ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన నియోజకవర్గ సిపిఐ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో నైజాంకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం భారత దేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లికించదగినదని అన్నారు. నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని బిజెపి ప్రభుత్వం హిందూ ముస్లీంల మధ్య పోరాటంగా చిత్రీకరించడం విచారకరమని అన్నారు. ఈ పోరాటంలో నాలుగు వేల అమరవీరుల రక్త తర్పణం చేయడం జరిగిందన్నారు. దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి దున్నేవాడిదే భూమి కావాలని లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ కే దక్కిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహోత్తరమైన పోరాటాన్ని అవమానపరిచి సాయుధ పోరాట యోధులకు రావాల్సిన ఫించన్లను ఎత్తివేసిన హీనమైన చరిత్ర ఉందని విమర్శించారు. సెప్టెంబర్ 17 పేరుతో బిజెపి అమరవీరులను స్మరించుకోవడం సిగ్గు చేటని దీని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుండి 17 వరకు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో యూరియా కొరత అత్యధికంగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై కక్షగట్టి రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటను ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. దీని మూలంగా వ్యాపారస్థులు కూడా యూరియాను కృత్రిమ కొరతగా సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల వ్యవసాయానికి సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదిన నల్గొండ లో జరిగే సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి ఉప్పునూతల వెంకటయ్య అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మైనోద్దీన్, కనకాచారి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జయరాములు, అచ్చయ్య, శైలేష్, రామస్వామి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సాగర్ గేట్ల ద్వారా నీటి విడుదల

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద తగ్గు ముఖం పట్టడంతో ప్రాజెక్టు అధికారులు రెండు గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. మంగళవారం ఉదయం వరకు లక్షకు పైగా కొనసాగిన ఇన్ ఫ్లో ఆ తరువాత వెంటనే వేల క్యూసెక్కులకు తగ్గిపోవడంతో అధికారులు వెంటనే 14 డేట్‌ల ద్వారా కొనసాగిన నీటి విడుదల మొదట ఆరు గేట్లకు పరిమితం చేసి ఆ తర్వాత ఇంకా వరద తగ్గుముఖం పట్టడంతో రెండు గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు.ప్రస్తుతం నాగార్జునసాగర్ రిజర్వాయర్ కు మంగళవారం సాయంత్రానికి 70038 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తూ ఉండటంతో రెండు గేట్లను ఐదు అడుగుల మేర పైకి లేపి 16012 క్యూసెక్కుల నీటిని స్పీల్ వే ద్వారా దిగువకు చేస్తున్నారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు గాను మంగళవారం సాయంత్రానికి 589.10 అడుగులుగా ఉండి నీటి నిల్వ సామర్థం 312.0450 టీఎంసీలకు 309.3558 టిఎంసీలుగా ఉన్నది. కుడి కాలువ ద్వారా 9700 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 9349 క్యూసెక్కులు ఎస్ ఎల్ బి సి ఏ ఎం ఆర్ పి ద్వారా 2400క్యూసెక్కులు ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేందద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 32277క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో ప్రాజెక్టుకు మొత్తం70038 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉండటంతో అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు.

## పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలి

### రాష్ట్ర ఎస్‌సి ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**ప్రజాపక్షం/సూర్యాపేట** : ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏఎఫ్ఓ విదేశీ విద్య కన్సల్టెన్సీ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమీషన్ చైర్మన్ మాట్లాడుతూ విదేశాలలో ఉన్నత విద్య చదువుకునేందుకు గ్రామీణ విద్యార్థులు ఎఎఫ్ఓ కన్సల్టెన్సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంబేద్కర్, జ్యోతిరావు విదేశీ విద్యా పథకాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించు కోవాలని తెలిపారు. ఉన్నత విద్య ద్వారా తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో పేద విద్యార్థులను విదేశాలకు ఉన్నత విద్యకోసం విద్యార్థులకు సహాయం చేస్తున్న ఏఎఫ్ఓ డైరెక్టర్ సురేష్ నాయకును చైర్మన్ అభినందించారు. సురేష్ నాయక్ మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య చదువుకోవాలని అనుకుంటున్న విద్యార్థిని విద్యార్థులు తమ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి ఎస్‌టి కమీషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# నా భూమిని నాకు ఇప్పించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



**ప్రజాపక్షం/నూతనకల్** : నా భూమిని నాకు ఇప్పించాలని కోరుతూ మండలంలోని మాచినపల్లి గ్రామానికి చెందిన గంగదారి రమేష్ అనే వ్యక్తి మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఇతడికి గ్రామ ప్రజలు కూడా అండగా నిల్చి ఆందోళనలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మాచినపల్లి గ్రామానికి చెందిన గంగదారి రమేష్ తన పెద్దనాన్న, పెద్దమ్మ బుచ్చయ్య పాపమ్మలకు సంతానం లేకపోవడంతో వారు చనిపోగా గ్రామపెద్దలు, కులపెద్దల నిర్ణయంతో వారికి దహన సంస్కారాలు చేసి, దశ దిన కర్మలు కూడా చేశారు. వారి పేరు మీద ఉన్న 3 ఎకరాలు 30 గుంటల భూమి ఉండగా రమేష్‌కు దక్కేలా బ్రతికి ఉండగానే వీలునామా రాశారు. దీనిపై గ్రామానికి చెందిన సురిగి రామచంద్రు, పసునూరి నగేష్, బ్రాహ్మండ్లపల్లి నాగార్జున చారి భూమిని కౌలుకు తీసుకొని చేస్తున్న రైతు తేజావత్ శంకర్‌తో కలిసి తప్పుడు పత్రాలను సృష్టించి పహాణీలో తమ పేర్లను నమోదు చేయించుకొని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న రమేష్ ఈ విషయం గ్రామ పెద్దలకు చెప్పగా వారంతా ఏకమై తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆందోళనకు దిగారు. బుచ్చయ్య పాపమ్మల భూమి రమేష్‌కే చెందాలని డిమాండ్ చేశారు. భూమిని అక్రమంగా తమ స్వంతం చేసుకోవాలనుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన దీనిపై సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు తెలియజేసి న్యాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నిమ్మనగోటి ముత్తయ్య, వి లింగయ్య, జి కొమరయ్య, జి మల్సూర్, లక్ష్మి నర్సు, పుల్లయ్య, కృష్ణ, చిన్న వెంకన్న, అవిలయ్య పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఈదులగూడకు చెందిన ప్రముఖ జర్నలిస్టు దండ భాస్కర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ యువ నాయకుడు నల్లమోతు సిద్దార్థ మంగళవారం భాస్కర్ చిన్న కర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. భాస్కర్ ఇద్దరు కూతుళ్లకు భవిష్యత్తులో ఉన్నత చదువుల విషయంలో, ఉపాది విషయంలోగాని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, తాను శాయశక్తుల కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయంగతా రూ.50వేలను అందించారు. ఆయన వెంట పల్నాటి జానకిరెడ్డి, పశ్యా శ్రీనివాస్‌రెడ్డి, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, రెడబోతు సంతోష్‌రెడ్డి, ఎండి.షోయబ్, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, విలేకరులు పాల్గొన్నారు.

## యూరియా అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యూరియా అక్రమ నిల్వలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల అజయ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందచేసి ఆయన మాట్లాడారు. రైతులకు అందాల్సిన యూరియాను అక్రమంగా నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల దుకాణాదారులు రైతులకు ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి యూరియా పక్కదారి పట్టకుండా చూడాలని, అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## భక్తుల మంచినీటి కోసం బోరుబావి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మండలం ఇంద్రియాలలో శ్రీ రాజగోపాల స్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తుల నీటి సౌకర్యార్థం గ్రామానికి చెందిన బందారపు రాజశేఖర్ ఆర్థిక సహకారంతో బోరు బావి ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ చింతల రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పావిరాల దయాకర్, ప్రధానకార్యదర్శి ఉడుతల వాసుదేవా, ధర్మకర్త గడ్డం శెట్టి గ్రామ పెద్దలు పబ్బు యాదయ్య, బీమాగోని నర్సింహా, పావిరాల మహేందర్, ఎర్ర లక్ష్మణ్, ఎర్ర మహేందర్, బోయిని లింగం, పెద్దిరెడ్డి యాదగిరి, గంగపురం లచ్చయ్య దాతకు ధన్యవాదాలు తెలిపారు.



## రైతులకు యూరియా కష్టాలు తీర్చాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వం రైతులకు యూరియా కష్టాలను వెంటనే తీర్చాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం వారు మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో యూరియా కోసం బారులు తీరిన రైతుల వద్దకు వెళ్లి వారి కష్టాలను అడిగి తెలుసుకోని మాట్లాడారు. రైతులు గంటల తరబడి క్యూలో నిలబడితే కేవలం రెండు కట్టల యూరియా ఇచ్చి పంపిస్తున్నారని, రైతులకు సరిపడా యూరియా అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రంలోని రైతులకు అవసరమైన యూరియాను అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు అప్పనబోయిన వెంకటయ్య, వస్కుల రవి, రామకృష్ణ, పురుషోత్తం, రాములు, ఆంజనేయులు, ప్రశాంత్, శేఖర్, నర్సయ్య, వెంకన్న, రామలింగయ్య పాల్గొన్నారు.

## కాళోజీ తన కవితలతో ప్రభావితం చేశారు



**ప్రజాపక్షం/సూర్యాపేట** : ప్రజాకవి కాళోజి నారాయణరావు తన కవితలతో ప్రజలను ప్రభావితం చేశారని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కాళోజి జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఆయన అందించిన స్ఫూర్తితో ప్రజలు సమాజ హితం కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయికుమార్, అడ్మిన్ ఆర్ఎస్ఐ అశోక్, సిసిసి సిబ్బంది, ఏఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు మనోధైర్యం కల్పించిన ఎస్‌పి...

విధుల నిర్వహణలో గాయాలైన కోదాడ పట్టణ కానిస్టేబుల్ నరేష్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి పరామర్శించి అతని అవసరాల దృష్ట్యా ఆర్థిక సహాయం అందించారు. విధుల నిర్వహణలో ధైర్యంగా ఉండాలని ఎలాంటి అవాంతరాలు వచ్చినా పోలీసు సిబ్బందికి జిల్లా పోలీసు అండగా ఉంటుందని మనోధైర్యం ఇచ్చారు. సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఏఓ మంజుభార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీసు సంఘం అధ్యక్షులు రాంచందర్ గౌడ్, ఆర్ఎస్ఐలు అశోక్, సాయిరాం, కానిస్టేబుల్స్ కొండలు, సుధాకర్ ఉన్నారు.

## సిఐకి సత్కారం





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దిలైట్ వెయిట్ మోటార్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ సీఐ జి. చరమందరాజు,ఎస్ఐ బండి మోహన్‌బాబులను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు,శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. మంగళవారం ది లైట్ వెయిట్ మోటార్స్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా బట్టు సత్యం యాదవ్,ఉపాధ్యక్షులుగా బెల్లంకొండ శ్రీను,కార్యదర్శి షేక్. ముస్తఫా,కోశాధికారి బెజవాడ వెంకటేష్,ప్రచార కార్యదర్శి పిల్లుట్ల సునీల్,కార్యవర్గ సభ్యులుగా షేక్.గౌడ్,నందిగామ నరసింహా,షేక్. మదార్,సైదారావు,సారెడ్డి నాగిరెడ్డి,లక్కం వెంకన్న,ధార గోపి,వీరాంజనేయులు,తారా శ్రీకాంత్,షేక్. మీరా,నాగేష్,జింకల గోపి,రౌతు నరేష్,ఇందిరాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : నేడు వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్ధంతిని పురస్కరించుకొని వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి సేవలను స్మరించుకునేందుకు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, బిసి కుల సంఘాల నాయకులు, ఇతర కుల సంఘ నాయకులు, జిల్లా ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## న్యాయవాదుల విధులు బహిష్కరణ




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మేడ్చల్‌కు చెందిన బండారు సురేష్ బాబు, నల్లగొండకు వడ్డెపల్లి వెంకటయ్య న్యాయవాదులపై దుండగులు దాడి చేయడాన్ని నిరసిస్తూ తెలంగాన న్యాయవాదుల సంఘం పిలుపుమేరకు మంగళవారం మిర్యాలగూడలో న్యాయవాదులు కోర్టులో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదులపై దాడికి పాల్పడిన దుండగులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని , న్యాయవాదుల సంరక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బార్ అసిసోయేషన్ సెక్రటరీ భూపతిరెడ్డి, ఎండి.ఇబ్రహీం, శ్రీనివాస్‌రావు, సుధాకర్ రెడ్డి, కర్నం లింగయ్య, వెంకట్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, సతీష్, శ్రీనివాస్, వేణు, కామేశ్వర్‌రావు, కిరణ్‌రెడ్డి, ఎల్లయ్య, సైదులు పాల్గొన్నారు.

## 11నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** 11నుంచి 17వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కాని కొన్ని పార్టీలు దానికి మతం రంగు పూసి చిత్రీకరిస్తున్నారని వారోత్సవాలను జరుపుకునే వారసత్వం ఎర్రజెండాకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవి నాయక్, అయూబ్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, లక్ష్మీ నారాయణ, సత్యనారాయణ, గోవర్ధని, ఊర్మిళా, అరుణ పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి వరం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పేదలకు ఆపదలో ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ అన్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్ యాదవ్ తెలిపారు. శివారెడ్డిగూడెంకు చెందిన వారాల కొండల్ రెడ్డికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60వేల చెక్ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉప్పునూతల మాధవి వెంకటేష్ యాదవ్, మండల నాయకులు చిలకల సంతోష్ యాదవ్, సరసాని వెంకట రెడ్డి పాల్గొన్నారు.






## 15న బిగ్ డిబెట్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** హైదరాబాద్‌లో సెప్టెంబర్ 15న నిర్వహించే బిగ్ డిబెట్‌ను జయప్రదం చేయాలని జార్జిరెడ్డి పిడిఎస్‌యూ నల్గొండ జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి కళాచారి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ క్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్‌లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు ఈ బిగ్ డిబెట్‌ను నిర్వహిస్తున్నామని అన్నారు. బకాయిల విడుదల కొరకు విద్యార్థులు పోరు బాటలో నడవాలని సూచించారు. ఈ సమావేశంలో జార్జిరెడ్డి పిడిఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి అంజి, జిల్లా కమిటి మెంబర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై గుంతలు పూడ్చాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** చిట్యాల భువనగిరి ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రజల ప్రాణాలు తీస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో తుమ్మలగూడెం సమీపంలో భువనగిరి ప్రధాన రోడ్డును పరిశీలించి గుంతలమయంగా ఉన్న రోడ్డు వద్ద మండల నాయకులతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బల్గూరి అంజయ్య, నాయకులు మీర్ ఖాజావలీ, ఎండి.రషీద్, గొరిగె సోములు, పులి భిక్షం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, గుండాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండల కేంద్రంలో ఫోటో ట్రేడ్ ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్ల హరిరెడ్డి, జిల్లా కోశాధికారి తునికి దశరథ, రాష్ట్ర ఉపాధ్యక్షులు యామల అప్పల రెడ్డి, పోస్టర్ ఆవిష్కరించి హైదరాబాద్ నార్సింగి ఓం కన్వెన్షన్ జరిగే ఫోటో ట్రేడ్ షోను జయప్రదం చేయాలని ఫోటో వీడియో గ్రాఫర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల యూనియన్ అధ్యక్షుడు ద్యానబోయిన రమేష్, రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు ఏశాల శారదా, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల రమేష్, జిల్లా కార్యదర్శి పసుల సత్యనారాయణ, జిల్లా గౌరవ సలహాదారుడు ఏశాల కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కసరబోయిన నాగ రాజు, సభ్యులు చందర్ నాయక్, కొండల్, పబ్బోజు సురేందర్ చారి, సిద్ధేంకి మహేష్, ఆకుల శ్రీనివాస్, ద్యానబోయిన నరసింహా తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :ఐటిఐ లో వివిధ ట్రేడ్‌లో విద్యను అభ్యసించి ఉత్తీర్ణులైన వారికి వివిధ కంపెనీల ద్వారా అందిస్తున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలను సద్విని చేసుకొని స్థిరపడాలని ప్రభుత్వ ఐటిఐ (బాలికల న్యూ) కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ భూక్య శ్రీరాములు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ (బాలికల న్యూ) కళాశాలలో సోమవారం నిర్వహించిన అప్రెంటిస్ జాబ్ మేళాను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ఐటిఐ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు నిర్వహించిన అప్రెంటిస్ మేళాలో ఆరు కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.ఈ మేళాకు నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలివచ్చారని తెలియజేశారు.సుమారు 250 మంది విద్యార్థులు మేళలో పాల్గొన్నగా 180 మంది విద్యార్థులలు ఎంపిక కవడం జరిగిందన్నారు. ఎంపికైన అయిన విద్యార్థులకు పరీక్షతోపాటు,ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఎంపికైన విద్యార్థులు క్రమశిక్షణతో తమకు అప్పజెప్పిన పనిని తూచ చెప్పకుండా నిర్వర్తించాలని సూచించారు. ఐటిఐ కళాశాల ఇన్చార్జి టిఓ జి.గిరిధర్, కంపెనీల ప్రతినిధులు ఎం శేఖర్, విజయ్ కుమార్, వి.రవితేజ, బి లక్ష్మణ్, సుమన్, ఐటిఐ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి..



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** న్యాయవాదుల రక్షణ కొరకు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి వెంటనే అమలు చేయాలని పలువురు న్యాయవాదులు డిమాండ్ చేశారు. జీడిమెట్లకు చెందిన న్యాయవాది బండారు సురేష్ బాబు పై కొందరు దుండగులు దాడి చేసి గాయపరిచిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ అందుకు నిరసనగా మంగళవారం హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ వృత్తి ధర్మంలో భాగంగా తమ వద్దకు వచ్చిన కక్షిదారుల తరపున చట్టపరంగా కేసులను వాదిస్తూ చట్టానికి లోబడి పని చేస్తున్న న్యాయవాదులపై ప్రతివాద కక్షిదారులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని భౌతిక దాడులకు పాల్పడటం,దౌర్జన్యాలు చేయడం బెదిరించడం న్యాయ వ్యవస్థకే గొడ్డలి పెట్టు అన్నారు. తమ విధుల బహిష్కరణకు సహకరించాలని కోరుతూ బార్ అసోసియేషన్ చేసిన తీర్మాన కాపీలను రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మీ శారద,సీనియర సివిల్ జడ్జీ రాధాకృష్ణ చౌహాన్,ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్,అదనపు జూనియర్ సివిల్ జడ్జీ ఆయోషా సరీనాలకు అందజేశారు. కార్యక్రమంలో చెనగాని యాదగిరి,జక్కుల నాగేశ్వరరావు,కాల్వ శ్రీనివాస రావు,రాఘవరావు,ఉప్పాల గోపాలకృష్ణ మూర్తి,ఉదారి యాదగిరిపాలేటి శ్రీనివాసరావు,రమణారెడ్డి,రామలక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎం)** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల కార్యదర్శి మహ్మద్ నయీమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల గ్రామాలలో పరిపాలన అస్తవ్యస్తమయిందని ఆయన ఎద్దేవా చేశారు. గ్రామపంచాయతీకి వచ్చే నిధులు రాక గ్రామ వ్యవస్థ కుంటుపడిపోయిందని, గ్రామాలలో ఉన్న రోడ్లు అకాల వర్షాలకు దెబ్బతిన్నాయనీ అన్నారు. రోడ్లు గుంతలమాయ్యామై వాహనదారులు ప్రమాదాల గురవుతున్నారు. వాటిని మరమ్మతులు చేయడానికి ఎవరిని అడగాలని దిక్కు తోచని స్థితిలో ప్రజలు ఉన్నారనని, ఆత్మకూరు మండల పరిధిలోని కూరెళ్ళ గ్రామం నుండి రాఘవాపురం వెళ్ళే దారిలో వాగు వర్షాలకు పూర్తిగా కూలి ఇబ్బంది కలుగుతుందన్నారు. తాత్కాలికంగా మట్టి పోసి నడిపిస్తున్నారు. అకాల వర్షానికి వాగు మధ్యలో గుంత ఏర్పడి వాహన దారులు ప్రమాదానికి గురవుతున్న పరిస్థితి ఏర్పడిందనీ వెంటనే వాగు పై హై లెవెల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలనీ అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మహ్మద్ నయీమ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు చొరవ తీసుకొని వెంటనే హై లెవెల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలనీ అన్నారు. లేని యెడల యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## కెసిఆర్ ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలాయే



**ప్రజాపక్షం/మోటకొండూర్** : 2007 తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలాయేనని వర్టూర్ గ్రామ దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలలోకి వెలితే తెలంగాణ ఉద్యమంలో భాగంగా అప్పటి యాదగిరిగుట్ట మండలంలోని వర్టూరులోని ఆడేపు లక్మయ్య ఇంటి ఆవరణలో బసచేస్తూ తెలంగాణ వస్తే అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తానని, ఆడెపు వెన్నెలకు డాక్టర్ చదువుకు అయ్యే ఖర్చులు భరిస్తానని, ప్రతి ఇంటికి బర్రెలు అందిస్తానని ఎన్నో హామీలు ఇచ్చిన కేసీఆర్ తెలంగాణ ఏర్పాటుతో వర్టూరు దళితులను పూర్తిగా మర్చిపోయారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులందరికీ దళిత బంధు ఇప్పిస్తామని చెప్పి నాయకులు ఎలాంటి సహాయ సహకారాలు అందివ్వలేదని ఆడపు లక్మ య్య కుమారుడు కృష్ణ అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నాడు కెసిఆర్ బస చేసిన ఇంటి ఆవరణంలోనే పల్లె నిద్ర కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆ గ్రామంలో మార్నింగ్ వాక్‌తో వర్టూరు ప్రజల సమస్యలు పరిష్కరించడానికి శ్రీకారం చుట్టడం విశేషం. బీర్ల అయిలయ్య ఆడెపు లక్మయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తూ, వర్టూర్ నుండి అమ్మనబోలు వరకు బిటి, వర్టూర్ నుండి శాఖంపల్లి అమ్మనబోలు వరకు లింకు రోడ్లు అన్నీ బిటి రోడ్లుగా మార్చాలని, అంగన్వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు నిర్మించాలని, ఇందిరమ్మ ఇండ్లు మరిన్ని ఇవ్వాలని, యాసంగి పంటలకు కట్టు కాల్వల ద్వారా గోదావరి జలాలు చేరువులలో నింపాలని వర్టూర్ ప్రజలు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను కోరుతున్నారు.

## నాంపల్లి పెద్దపురం చెరువులు నింపాలి

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలో శేషలేటి వాగు పై ఫీడర్ ఛానల్ నిర్మించి నాంపల్లి, పెద్దాపురం చెరువులు నింపితే వేయిల ఎకరాలు భూమి సాగులోకి వస్తుందని సిపిఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి అన్నారు. మంగళవారం సిపిఎం బృందంతో కలిసి శేషలేటి వాగును పరిశీలించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సోషల్టి వాగు పొంగిపొర్లినప్పుడు లింగోటం నుండి కప్పలమ్మ చెరువు వరకు కప్పలమ్మ చెరువు నుండి శేషలేటి వాగు రాందాస్ తండా మీదుగా వృధాగా నీరు పొయ్యి చేపూరు చెరువుకు చేరుతుందని అనంతరం ఆ నీరు వృధా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వాష్పాక ముత్తిలింగం, కొమ్ము లక్ష్మయ్య, వెంకటయ్య నరేష్, వేలాద్రి పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులే రేపటి పౌరులు



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : తల్లిదండ్రులు ఎంతో ఆశతో తమ పిల్లల భవిష్యత్ కోసం ఎంతో కష్టపడుతూ పిల్లల చదువుల కోసం కష్టపడుతున్నారని జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గోలి ప్రభాకర్ అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు చిత్తశుద్ధితో ముందు చూపుతో ఉన్నతమైన ఆశయంతో బాగా చదువుకుని ప్రయోజకులు అయినప్పుడే కన్న తల్లీ దండ్రులకు సంతోషం అని అన్నారు. మంగళవారం మధ్యాహ్నం చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామ ఉన్నత పాఠశాలలో జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు దేశం కోసం పోరాడి అమరులు అయిన స్వాతంత్ర సమర యోధుల చిత్ర పటాలు గీసే పోటీలు మరియు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలో గెలిచిన 1వ, 2వ, 3వ బహుమతులు ప్రతి తరగతి విద్యార్థులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొల్లి రవికుమార్, క్రాంతికుమార్, స్వప్న, గౌసియా, మమత, స్వరూప, లింగస్వామి, లలిత, శైలజ, రజిత, పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయులు రాము, ఉపాధ్యాయ ఉపాధ్యాయనులు తదితరులు పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : హైద్రాబాద్‌లో న్యాయవాది సురేష్ బాబుపై కొంత మంది వ్యక్తులు దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సూర్యాపేట న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొంపల్లి లింగయ్య మాట్లాడుతూ ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఉపాధ్యక్షులు గుంటూరు మధుతోపాటు న్యాయవాదులు వసంత సత్యనారాయణపిళ్లె, కాకి రాంరెడ్డి, అనంత కుమార్ పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు



**ప్రజాపక్షం/డిండి;** తెలంగాణలో స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్యా, ఉద్యోగ, రాజకీయ అభివృద్ధికి తొడ్పడాలని అఖిల భారత యాదవ మహాసభ డిండి మండల అధ్యక్షులు బద్దెల శ్రీనివాస్ యాదవ్ కార్యనిర్వాక అధ్యక్షులు ఎస్‌సిఎల్ అశోక్ యాదవ్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక యాదవ సంఘం భవన ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో వారు వివిధ అంశాలపై చర్చించారు. త్వరలోనే అన్ని గ్రామ కమిటిలను ఏర్పాటు చేస్తామన్నారు. మండల యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు గెలవలయ్య, కార్యదర్శి మహేష్, కోశాధికారి రాజు, పెద్దయ్య, సలయ్య పాల్గొన్నారు.




## మాదక ద్రవ్యాలు అరికట్టాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌:** గంజాయి,డ్రగ్స్,మాదకద్రవ్యాలు అరికట్టాలని, ఆన్‌లైన్ బెట్టింగులు వద్దు మన ఆరోగ్యమే ముద్దు అనే నినాదంతో అవగాహన సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ)హుజూర్‌నగర్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ తహశీల్దార్ ఎమ్. నాగార్జున్ రెడ్డి,ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్ఎమ్ఓ డాక్టర్. నక్క రవికుమార్ లతో కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మీసాల వీరబాబు,రామాల అనిల్,నక్కినబోయిన శంకర్,కె. సాయి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఫ్రీ ప్రైమరీ స్కూల్ రద్దుచేసి అంగన్వాడీ టీచర్లను ఆదుకోవాలని, సిఐటియు మండల కన్వీనర్ మంచాల మధు డిమాండ్ చేశారు. మంగళవారం ఫ్రీ ప్రైమరీ స్కూలు నడిపించాలని ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని పోచంపల్లి తాసిల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ ఉద్యోగులతో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉద్యోగులు జంగమ్మ, వసంత, పారిజాత, ప్రమీల, మంగ, ఉమ, జయలక్ష్మి, శివరాణి, సువర్ణ, అరుణ, పద్మ, పుష్ప, శోభ తదితరులు పాల్గొన్నారు.

## సిఐ ప్రతాపలింగంను కలిసిన నాయకులు



**ప్రజాపక్షం/కోదాడరూరల్:** కోదాడ రూరల్ సిఐగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్‌లింగంను మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు మర్యాదపుర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు పులి సులోచనరావు, గద్దల వెంకటేశ్వర్లు, కొండా పూర్ణ, పాలకి సురేష్, బండి చిన్నకోటయ్య, పిడమర్తి వెంకట్రావ్ పాల్గొన్నారు.

## పిపిఆర్‌ను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండల పరిధిలోని చౌడంపల్లి గ్రామంలో మంగళవారం పిపిఆర్ (పుర్రు )వ్యాక్సిన్ పంపిణి చేశారు. ఈ సందర్బంగా నార్కట్ పల్లి పశువైద్యశాల డాక్టర్ రవి నాయక్ మాట్లాడుతూ 600 గోర్లు, 145 మేకలకు పిపిఆర్ ఇంజక్షన్ వేసినట్లు వివరించారు. ఈ సదావకాశాన్ని ప్రతి రైతు గొర్ర సంఘం నాయకులు, చైర్మన్లు, సభ్యులు, రైతులు సద్వినియోగంచేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నార్కట్ పల్లి పశువుల దావఖాన సిబ్బంది ఎల్ ఎస్ ఏ రియాజ్. ఓఎస్ రియాజ్, గోపాలమిత్ర చిరుమర్తి వెంకన్న, సెలకంటి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు సైకిళ్లు , పాఠశాలకు కంప్యూటర్ అందజేత



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్, మెంబర్‌షిప్ ఎక్స్‌టెన్షన్ తెలంగాణ, కేపాల్‌బోన్ సెట్టింగ్ సెంటర్ ఔషాపూర్ అధినేత డా. ఎంపల్లి బుచ్చిరెడ్డి సౌజన్యంతో పాఠశాల ప్రిన్సిపాల్ అధ్యక్ష_ _న బుధవారం పాఠశాలకు ఒక కంప్యూటర్‌ను, ఐదుగురు విద్యార్థులకు సైకిళ్లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అడ్వకేట్ రహీం మాట్లాడుతూ పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా పాఠశాలలోని విద్యార్థులందరికి స్పోర్ట్స్ యూనిఫాం, షూ అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం డా. సుమన్త్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానప్రకాష్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు దెబ్బతిన్న చెక్ డ్యామును పునర్నిర్మించాలి



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** తుర్కపల్లి మండల ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం గంధమల్ల గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు సుర్వి శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇటీవల భారీ వర్షాలకు నీటి ప్రవాహంలో ఎస్సీ కాలనీలోని పెద్ద బాయి చెక్ డ్యామ్ భారీ వర్షాలకు కొట్టుకపోయినా చెక్ డ్యాముని ఇప్పటి వరకు ఏ అధికారులు సందర్శించకపోవడం చాలా బాధాకరమని ఈ చెక్ డ్యామ్ కింద సుమారు యాభై రైతు కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మి నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రమేష్, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శిలు ఆంజనేయులు, బినారం కనకయ్య, సీనియర్ నాయకులు జక్కుల వెంకటేష్, బూతు అధ్యక్షులు, బినారం నరసింహులు, బోళ్ల జాంగిర్, యాశ బోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 1104 యూనియన్ నల్లగొండ డివిజన్ కమిటీ ఎన్నిక



**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్, నల్లగొండ డివిజన్ కమిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం పట్టణంలోని రత్న ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. అనంతరం కంపెనీ కార్య నిర్వాహ అధ్యక్షులు నేతకాని వెంకన్న, మేరెడ్డి రామిరెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ డివిజన్ నూతన కమిటీ ని ఎన్నుకున్నారు.డివిజన్ అధ్యక్షులుగా పురం రాంబాబు, కార్య నిర్వాహ అధ్యక్షులుగా డెంకల సత్యనారాయణ,డివిజన్ కార్యదర్శిగా తిరుగుడు శ్రీనివాస్, అదనపు కార్యదర్శిగా రామావత్ బాలు,డివిజన్ సంయుక్త కార్యదర్శిగా ఎస్ లింగస్వామిల ను ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన యూనియన్ నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మచెట్ల వెంకటయ్య, అధ్యక్షులు టి జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## కామ్రేడ్ మావోకు విప్లవ జోహార్లు




**ప్రజాపక్షం/కోదాడ:** చైనా విప్లవోద్యమ రథసారథి మార్క్సిజాన్ని వెనుకబడిన దేశమైన చైనాకు అన్వయింపు చేసుకుని చైనాలో విప్లవోద్యమాన్ని విజయవంతం చేసిన మహా నాయకుడు, కమ్యూనిస్టు మహోపాధ్యాయులలో ఒకరు పీడిత దేశాలలో జరిగే విప్లవోద్యమాలకు ఆదర్శప్రాయుడు కామ్రెడ్ మావో అని అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి అన్నారు. మంగళవారం స్థానిక లాల్‌బంగ్లాలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో కామ్రెడ్ మావో 48వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. భారతదేశ విప్లవోద్యమ విజయవంతానికై మార్క్సిజం లెనినిజం మావో ఆలోచన విధాన, భారత దేశ విముక్తికి వెలుగు దారి అని అన్నారు. మావో చూపిన దీర్ఘకాలిక సాయుధ ప్రజాయుద్ధ పంథాయే మనలాంటి వెనుకబడిన దేశాల విప్లవోద్యమాలకు దిక్సూచి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి వి.నర్సింహారావు, విజయ్, వీరబాబు, నగేష్, సలీం, రవితేజ, ఖాసీం, నర్సింహారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## ఉద్యమాన్ని బలోపేతం చేస్తాం

**ప్రజాపక్షం/చండూరుః** రానున్న రోజుల్లో ఎంఆర్‌పిఎస్ ఉద్యమాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేస్తామని దళిత రత్నా ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా వెంకటేశ్ మాదిగ పిలుపు మేరకు మంగళవారం చండూరులో నిర్వహించిన ఎంఆర్‌పిఎస్ మండల కమిటీ అత్యవసర సమావేశానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడుగా అన్నెపాక శంకర్ మాదిగను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శోభన్ మాదిగ, కందుల మధు, శ్రవణ్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచులు లేక ఇబ్బందులు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలుగా కావస్తున్న గ్రామంలో సర్పంచులు లేక ఇబ్బంది పడుతున్న పంచాయతీ కార్యాలయాలు, కార్యదర్శులు అని తుర్కపల్లి మండల బిఆర్‌ఎస్ నాయకులు ఓర్సు బిక్షపతి అన్నారు. గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ పాలన ఏర్పడిన తర్వాత ఎవరికి ఏం చెప్పాలో తెలియని స్థితిలో గ్రామ ప్రజలు ఉన్నారని, గ్రామ పంచా యతీ కార్యదర్శులు మీద భారం పడడంతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నిధులు లేక గ్రామాలలో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు లేక, గ్రామాలలో వీధిలైట్ల కొరత పారిశుద్ధ్యం కొరత ఎక్కువగా ఉన్నదని అన్నారు. ఇప్పటివరకు ఎలక్షన్లు జరగకపోవడం చాలా నిర్లక్ష్యమని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎలక్షన్ కొనసాగించి గ్రామాలలో మంచి పాలన జరిగేలా చూడాలని కోరారు.

## కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/దేవరకొండ:** బిజెపి దేవరకొండ మునిసిపల్ శాఖ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ పిలుపు మేరకు మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్ మాట్లాడుతూ నల్గొండలో వినాయక నిమజ్జనం సందర్భంగా నల్గొండ జరిగిన సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన రాజకీయ ప్రసంగం, ఇతర మతస్థుల గురించి గొప్పలు చెప్పడం ఏమిటని ప్రశ్నించిన బిజెపి జిల్లా అధ్య క్షులు నాగం వర్షిత్‌రెడ్డిని అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఈక్యాక్రమంలో సినియర్ నాయకులు శేఖర్, అంజయ్య, రవికుమార్, సహదేవుడు, శంకర్, హరి, శంకర్, అజయ్ పాల్గొన్నారు.

## యాదవ సంఘం అధ్యక్షుడిగా బయ్యా మల్లయ్య యాదవ్ ఎన్నిక

**ప్రజాపక్షం/డిండి;** అఖిల భారత యాదవ మహాసభ డిండి గ్రామ శాఖ నూతన కమిటిని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ నూతన అధ్యక్షులుగా బయ్యా మల్లయ్య యాదవ్‌ను ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని మండల అధ్యక్షులు బద్దెల శ్రీనివాస్, కార్యనిర్వహక అధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు చేతుల మీదుగా అందజేశారు. త్వరలోనే మండలంలో అన్ని గ్రామ కమిటిలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యాక్షుఉలు గెలవలయ్య, కార్యదర్శి మహేష్, కోశాధికారి రాజు, పెద్దయ్య, జంగయ్య, శ్రీనివాస్, సైదులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కాళోజీ స్ఫూర్తిని కొనసాగిద్దాం



**ప్రజాపక్షం/కోదాడ:** బడి పలుకుల భాష కాదు... పలుకు బడుల బాష కావాలని కాళోజీ ప్రజా భాష ద్వారా తెలంగాణ ప్రాంతంలో ప్రజా చైతన్యానికి చేసిన వ్యక్తి అని బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మార్కేండేయ అన్నారు. మంగళవారం బాలుర ఉన్నత పాఠశాలలో కాళోజీరావు జయంతి ఉత్సవాలలో భాగంగా తెలుగుభాష దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాళోజీరావు జీవిత విశేషాలు, తెలంగాణ ఉద్యమంలో కాళోజీ బాషా, సాహిత్య ప్రభావం, తెలంగాణ బాష, యాస, మధురత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మాచారి, చిన్నప్ప, జానకిరామ్, శ్రీనివాస రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి**; ప్రజా కవి కాళోజీ జన్మదిన వేడుకలను తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని కొండమల్లేపల్లి గ్రామ పంచాయతీ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డాకు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి శంకర్, బిల్ కలెక్టర్ అందుగుల ప్రవీణ్, రాంరెడ్డి, లక్ష్మణ్, అంజి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.










**ప్రజాపక్షం/ రామన్నపేట:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్‌పై కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాకవి కాళోజి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శేఖర్, స్వామి, లేషాచారి, ఆర్‌పీలు రవి, శ్రీనివాస్‌రావు, హరికిషన్, అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జూనియర్ కళాశాలలో...** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కాళోజి నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రముఖి జగదీష్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు పున్నా ప్రసూనాదేవి, నగేష్, పున్నారావు, మాలె వెంకట్‌రెడ్డి, మందడి వెంకట్‌రెడ్డి,కిరణ్, నరసింహారావు, అశోక్, శ్రీకాంత్, ఉపేందర్‌రావు, నర్సయ్య, నిర్మల, కవిత, రాజేశ్వరి, కరుణ పాల్గొన్నారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...** ప్రజాకవి కాళోజి జయంతి సందర్భంగా తెలంగాణా భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు రాహత్‌ఖానం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ చిన్నబాబు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ లక్ష్మీ నీలిమా, పాలనాధికారి కరుణాకర్, అధ్యాపకులు సునీత, కిషన్, బ్రహ్మం, రవీందర్‌రావు, అమరేందర్, ఆంజనేయులు, నరేష్, శ్రీనివాస్, రవి, రాధిక పాల్గొన్నారు.

**ఎంపీడీవో కార్యాలయంలో...** ప్రజాకవి కాళోజి నారాయణరావు 111వ జయంతిని స్తానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాములు కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీవో రావుఫ్అలీ, ఏపీవో వెంకన్న, కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించారు. కాళోజీ నారాయణ రావు జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సినియర్ అసిస్టెంట్ శివానందం, జూనియర్ అసిస్టెంట్ లు వివేక్, నవీన్, శేఖర్, సురేష్, శివాజీ, అజయ్ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/నల్లగొండ(నకిరేకల్):** ప్రజా కవి కాళోజీ ప్రజాస్వామిక స్ఫూర్తిని , అన్యాయాన్ని ఎదిరించే స్వభావాన్ని ముందు తరాలకు అందించాలని నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య పిలుపునిచ్చారు. ప్రజా కవి కాళోజి జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని తాటికల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డా. సాగర్ల సత్తయ్య నర్రా వెంకట్ రెడ్డి, లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్య, పద్మ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ భాషా దినోత్సవం, తెలంగాణ వైతాళికుడు కాళోజి నారాయణరావు 111వ జయతి వేడుకలను మంగళవారం మండలంలోని జప్తివీరప్పగూడెం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రధానోపాధాయయుడు బొలిశెట్టి భిక్షపతి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుడిపాటి కోటయ్య, దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మాధవి, శ్రీనివాస్‌రెడ్డి, జలరాం, చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజి నారాయణ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు మలిగిరెడ్డి భీమార్జున రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : కాళోజి నారాయణ రావు 111వ జయంతి వేడుకలను మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సిఈఓ అప్పారావు పుట్టుక నీది, బ్రతుకంత దేశానిది అని ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తన కవిత్వంతో కాళోజి నారాయణరావు ప్రజలను మమేకం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారి టి నరసింహులు, డిపిఓ యాదగిరి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శంకర్ నాయక్, ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి దయానంద రాణి తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ లోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలో మంగళవారం తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతి







వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ సతీష్ , పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత మహాకవి కాలోజీ నారాయణరావు తెలంగాణకు అందించిన సేవలు చిరస్మరణీయమని హై స్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఆకురాతి అమృతయ్య అన్నారు. కాలోజి నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం ను పునస్కరించుకొని మంగళవారం తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై .సరోజినీ దేవి, ఎస్. కె గౌసియా, పత్తిపాటి వినయ్ కుమార్, డాక్టర్. మే రావత్ భాను నాయక్, లక్ష్మీరాం, అనిత దేవి, సాయిబాబు, సత్యనారాయణ, రాములు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:**ప్రజాకవి కాలోజీ నారాయణ రావు జయంతి ఉత్సవాల తెలుగు భాషా దినోత్సవాన్ని ఎంపిడిఓ ఉమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం లో కాలోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ సుధాకర్, సూపర్డెంట్ రజిత కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రముఖ తెలంగాణ వైతాళికులు డాక్టర్ కాళోజి జయంతి,తెలంగాణ భాషా దినోత్సవం ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునాసు వెంకట్ అంజిరెడ్డి, మధు లక్ష్మణ్ వివిధ శాఖల అధ్యాపకులు డాక్టర్ శ్రావణ్, డాక్టర్ షరీఫ్,గంగాధర నరసింహ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పుట్టుక నీది చావు నీది, బ్రతకంతా దేశానిది అని చాటి చెప్పడమే కాకుండా, తన జీవితాన్ని తెలంగాణకు అంకితం చేసిన ప్రజాకవి కాలోజీ నారాయణరావు మహనీయుడని ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి వై. అశోక్ రెడ్డి అన్నారు.కాళోజి నారాయణరావు 111వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కాలోజి నారాయణరావు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, ఆయా విభాగాల అధిపతులు, సిబ్బంది హాజరయ్యారు.






# ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**- సిఎం రిలీఫ్‌ఫండ్, కల్యాణలక్ష్మీ పథకాలు పేదలకువరం**
**- కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని**
**- ర.44.28 లక్షల చెక్కులు లబ్దిదారులకు పంపిణీ**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేద వర్గాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం రూ.44.28 లక్షల విలువచేసే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పేద వర్గాలు పథకాలను మరింత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులతో పాటు పౌరులపై ఉందన్నారు. ఐతే ఫండ్ మొత్తంలో కోతలు విధించి తక్కువ స్థాయిలో మంజూరీ చేయడం సరైంది కాదన్నారు. వైద్యం కోసం ఖర్చు చేసిన మొత్తంలో 75 శాతం బిల్లును ప్రభుత్వం చెల్లించాలన్నారు. పిల్లల పెళ్లిల్ల కోసం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పంథకం ఎంతగానో సహాయ పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తులం బంగారం పథకాన్ని సత్వరమే అమలు చేయాలని, అధికారంలోనికి వచ్చిన తర్వాత దరఖాస్తు చేసుకున్నవారందరికీ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎకేసే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మి పతి, దారా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెలకు టీకాల శిబిరం



**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** ఇటిక్యాల మండలంలో గొర్రెలు, మేకలలో ఉచితంగా పారుడు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం గత నెల 29 నుండి ఈ నెల 15 వరకు కొనసాగుతుందని డా.భువనేశ్వరి, డా.వినయ్ తెలిపారు. గొర్రెల కాపరులకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లే వ్యాధులలో ఈ వ్యాధి కీలకమైనది. మర్బిల్లి అనే వైరస్ ద్వారా సంభవించే ఈ వ్యాధి అనతి కాలంలోనే మందలోని అన్ని జీవాలకు వేగంగా వ్యాపిస్తుంది. గొర్రెల కంటే మేకలలో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువ, మరియు మరణాల రేటు కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి సంభవించిన జీవాలు అధిక జ్వరము (105107 ఎఫ్) మరియు ఆకలి మందగించి, కళ్ల నుండి నీరు కారుతూ ముక్కు నుండి స్రావాలు , తీవ్రమైన విరోచనాలు ఉండి డిహైడ్రేషన్తో, బక్క చిక్కి శ్వాస కోస ఇబ్బంది, దగ్గు లక్షణాలు చూపి చనిపోతాయి. కొన్నిసార్లు అరుదుగా గర్భస్రావం సంభవిస్తుంది. నోటిలో చిగుర్లు, ఎరుపెక్కి పుండ్లు, కూడా ఏర్పడతాయి. ఈ వ్యాధి సోకిన జీవాలను మంద నుండి వేరు చేసి వైద్యం అందించాలి. కావున గొర్రెల కాపరులు వ్యాధి రాకుండా ముందస్తుగానే టీకాలు వేయించి జీవాలను సంరక్షించుకోగలరు. కోదండపురం మరియు ధర్మవరం గ్రామాలలోని 6760 జీవాలకు టీకాలు వేయడం జరిగింది.

## జిల్లా విద్యాధికారిగా విద్యాచందన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా విద్యాధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా విద్యావిభాగానికి చెందిన పరిపాలన, పర్యవేక్షణా,కార్యక్రమాలు, పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగు, ఉపాధ్యాయులు పర్యవేక్షణ వంటి అంశాలను ఆమె సమన్వయం చేయనున్నారు.

## ఈవిఎం గోదాముల తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం** ఆర్డిఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఈవిఎం ప్యాట్లు ఉన్న గదిని, సిసి కెమోరా గదిలోని కెమోరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోదాము పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవ్వరినీ లోనికి అనుమతించరాదని ఆదేశించారు. అనంతరం రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, పొలిటికల్ పార్టీ నాయకులు నోముల రమేష్, లక్ష్మణ్ అగర్వాల్,రాంబాబు, శ్రీనివాస్, సలీం, నవీన్, అశోక్ తదితరులున్నారు.

# జల్లాపురం గ్రామంలో అభినందన సభ



**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో ఉన్న పీఎం జెడ్పిహెచ్‌ఎస్ హై స్కూల్ స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న బషీర్ అహ్మద్ కి వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం సంగినేనిపల్లి గ్రామంలో ఉన్న జడ్పిహెచ్ హై స్కూల్ కు గెజిటెడ్ స్కూల్ హెడ్ మాస్టర్‌గా ప్రమోషన్ రావడంతో ముందుగా శ్రీ బషీర్ అహ్మద్ కి స్కూల్ హెడ్ మాస్టర్ ఆర్ .విష్ణువర్ధన్ సమక్షంలో స్కూల్ స్టాఫ్ అందరు కలిసి ధన్యవాదములు అభినందనలు తెలిపారు. ఆయన స్థానంలో మానవపాడు మండల కేంద్రంలో ఉన్న ప్రైమరి స్కూల్ ఎస్‌జిటి గా ఉండా స్కూల్ అసిస్టెంట్‌గా ఇదే మండల కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న పీఎం జెడ్పిహెచ్‌ఎస్ హై స్కూల్ కు పదోన్నతి పై సోషల్ టీచర్‌గా ఇక్కడికి రావడం జరిగింది. కావున ఇక్కడ నుండి ప్రమోషన్ పై వెళ్లిన బషీర్ అహ్మద్ కి వీడ్కోలు పలుకుతూ ఇక్కడికి వచ్చిన రామేశ్వర్ రెడ్డి కి స్వాగతం పలుకుతూ వారిని పాఠశాల సిబ్బంది తో పాటు గ్రామ పెద్దలు సుగుణాకర్ రెడ్డి శాలువాలతో సన్మానించారు. ఇదే కార్యక్రమంలో జిల్లా ఉత్తమ టీచర్‌గా ఎన్నికైన శ్రీధర్ ఎస్‌ఎ తెలుగుని కూడా సిబ్బంది సన్మానించడం జరిగింది. ఈ అభినందన సభ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ విష్ణువర్దన్, సుగుణాకర్ రెడ్డి, మురళిధర్ , చెన్నారెడ్డి, మస్తాన్‌వలీ, వెంకన్న , రజిని, కుమార్, తిరుపతి, విజయలక్ష్మి , నాగరజిత, అరవింద, మాధవి కె.లక్ష్మి , పి.లక్ష్మి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీల సమస్యలను పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మార్కెట్ కమిటీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీల ఛైర్మన్ ఫోరం కోరింది. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి నివాస సముదాయంలో రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ల ఫోరం సభ్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. మార్కెట్ కమిటీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని విన్నవించారు.

# ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయం

**-అదనపు కలెక్టర్ విద్యాచందన**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఐడిఓసిలో కాళో జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజిక ఉధ్యమకారునిగా, ప్రజా చైతన్య వేత్తగా కాళోజీకి తెలంగాణలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. భాషా వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరిక బాధ్యతగా భావించి కాళోజీ చూపిన దారిలో నడవాలని పిలుపునిచ్చారు.

**భద్రాచలంలో...**

ఐటిడిఏలో కాళోజీ జయంతి జరిపారు. ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. తెలంగాణ జీవిత చలన శీలి కాలోజీ అన్నారు. అన్యాయాన్ని ఎదురించే వాడే ఆరాధ్యుడని చెప్పన దిశాలి అన్నారు. కాళోజీ స్పూర్తితో అధికారులు గిరిజనులకు మంచి సేవలు అందిచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయల సిబ్బంది పాల్గొన్నారు.

# దుండగులను కఠినంగా శిక్షించాలి



**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** సమాజంలో కొంతమంది దుండగులు పని కూడగట్టుకుని అంబేద్కర్ విగ్రహాలను కూల్చుతున్నారని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మణికుమార్ అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో ఆయన ముఖ్య కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. బాలానగర్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి లో కొంతమంది దుండగులు డా.బి.ఆర్.అంబేద్కర్ ధ్వంసం చేశారని అన్నారు. దేశంలోని కోట్లాదిమంది ప్రజలకు హక్కులను కల్పించిన హక్కుల ప్రధాత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలను కూల్చడం హేయమైన చర్య అని ఖండించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహనీయుల విగ్రహాలను కూల్చిన ధ్వంసాలకు పాల్పడిన కఠిన శిక్షలు పడేలా చట్టాలను తీసుకురావాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పగడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు. ఆయనతో పాటు మండల అధ్యక్షుడు ధర్మవరం రాముడు, శాంతి,రాజు, రామారావు, ధరూర్ అంజి ఇతరులు పాల్గొన్నారు.

# ఘనంగా పరిశుద్ధ మరియమ్మ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ప్రతి ఏడాది సెప్టెంబర్ 9న పరిశుద్ధ మరియమ్మ జన్మదిన వేడేకలను అంగరంగ వైభవంగా సోమవారం నిర్వహించుకోవడం జరిగిందని ఆర్సియం పునీత పౌల్, పేతురు దేవాలయ విచారణ గురువు తీరు హృదయ సభ గురువులు సిద్దెల జేసు ప్రసాద్, ఉప గురువు వరుణ్ అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 9న సర్వ మానవాళికి పవిత్రురాలైన పరిశుద్ధ మరియమ్మ, లోకరక్షకుడైన ఏసుప్రభుకు పవిత్ర జన్మనిచ్చిన తల్లి పరిశుద్ధ మరియమ్మ, మధ్యస్థ ప్రార్ధన సహాయంతో భక్తుల కోరికలను నెరవేర్చి చిన్నారి పిల్లలకు దర్శనమిచ్చి పలు పట్టణ ప్రాంతాల్లో వెలసిన ఆరోగ్యమాత, వేలంగిని మాతగా కొనియాడటం క్రైస్తవ భక్తుల విశ్వాస ఘట్టమన్నారు. ప్రతి ఏటా మే, అక్టోబర్ మాసంలో పూజిత మరియమ్మ జపమాట మాసంగా, శ్రీ సభ నియమించిన జపమాట కార్యక్రమాలను సైతం ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, విచారణలోని, క్రైస్తవభక్తులు, విశ్వాసులు, కుటుంబాల సమేతంగా ప్రత్యేక పరిశుద్ధ మరియమాత జపమాల, పూజిత మాసంగా, నిష్కలంక పరిశుద్ధ మరియమ్మ జనపమాలను జపించడం ఆనవాయితీ వస్తుందన్నారు. పరిశుద్ధ మరియమ్మ పలు ప్రాంతంలోని అనేక మంది చిన్న పిల్లలకు దర్శనమిచ్చి, గ్రామాల ప్రజల స్థితిగతులను, అద్భుతాలను, స్వస్థతలను కేవలం 53 పూసల జపమాలతో అద్భుతాలు చేసి, ఆరోగ్యమాతగా ఇహపర లోకంలో వెలిసిన పరిశుద్ధ మరియమ్మ మాత్రమే అని కొనియాడారు. ఈకార్యక్రమంలో డీఎస్ఎస్ సిస్టర్ విమల కాన్వెంట్ సుపీరియల్ ప్రశాంత, దామరిస్, ప్రిన్సిపాల్ మహిత, జ్యోతిర్మయి యానిమేటర్ పరమ ప్రభాకర్, కిరణ్, సంఘ పెద్దలు నాగేశ్వరరావు, మరియదళం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో కాళోజీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ పుట్టుకు నీది చావు నీది బ్రతుకంత దేశానిదే అంటూ తెలంగాణ మాండలికంలో చక్కని కవితలు అల్లిన విశ్వ మానవ కవి కాళోజీ అన్నారు.